కిక్కిరిసిన ప్రయాణీకులతో పద్దెనిమిదో నంబర్ సిటీబస్సు 'తార్నాక' స్టాప్‌లోకొచ్చాగింది. బస్సు ఆగిందే తడవుగా షెల్టర్‌లోని ప్రయాణీకులు బిలబిలమంటూ బస్‌డోర్ల దగ్గర గుంపులుగా చేరారు. బస్సులోంచి ప్రయాణీకులు అతికష్టం మీద తోసుకుంటూ, నెట్టుకుంటూ ఒక్కొక్కరు బయటపడి "హమ్మయ్య!" అని తృప్తిగా గాలిపీల్చుకుని ఎవరి మానాన వాళ్ళు వెళుతున్నారు.

ఆ బస్సులో కూర్చోటానికి గాదుకదా, కనీసం నించోటానికయినా చోటు దొరుకుతుందో లేదో! అయినా బస్సు దిగే వారందర్నీ దిగనీయక ముందే,

# మోసానికి దయలేదు

— ఎస్.రవి



వాళ్ళని పక్కలకు పడదోసుకుంటూ బస్సులోకి దూరబడుతున్నారు కాస్తంత కండబలం గలవాళ్ళు. ఎలాగైతే బస్సు నుంచి దిగేవాళ్ళు, ఎక్కేవాళ్ళు ఎక్కగానే కండక్టర్ 'రైట్' చెప్పటంతో బస్సు నెమ్మదిగా కదిలింది హారన్ మ్రోగించుకుంటూ.

బస్సులో ప్రయాణీకుల ఒత్తిడికి ఒక వృద్ధురాలి భుజాన వున్న రెండేళ్ల పిల్లాడు "ఈ... ఈ..." అంటూ ఏడుపు లంఘించుకున్నాడు. ఆ వృద్ధురాలికి దాదాపు ఏభై ఏళ్ల వయసుంటుంది. చూట్టానికి పూర్తి పాతకాలం మనిషిలాగా, పల్లెప్రాంతానికి చెందిన దానిలాగా వున్నది.

భుజాన వున్న పిల్లాడిని అటుఇటూ కదుపుతున్నది. ఏడ్పు మానతాడేమోనని, కానీ పిల్లాడు ఏడ్పు మానలేదు. చుట్టుప్రక్కలున్న ప్రయాణీకులకు విసుగ్గా, అసౌకర్యంగా తోచింది.

"ఏం తల్లీ! ఇంత ఇరుకులో ఇంటిపిల్లాడితో ఈ బస్సులోనే నించోని రాకపోతే వెనకమాల బస్సులో రావచ్చుగా?" అన్నాడో ఆసామి.

"నా మనవడికి ఒంట్లో సుస్తీ చేసిందయ్యా! ఆసుపత్రికి తీసుకెల్దామని బయల్దేరినా, ఇందాకట్నుంచీ చూతన్నా అన్ని బస్సుల్లో జనం ఇట్టాగే వుంటన్నారయ్యా! అందుకే ఈ బస్సెక్కినానయ్యా!" దీనంగా చెప్పింది వృద్ధురాలు.

"ఫుట్‌పాత్ మీద వాళ్ళు లోనికి రావాలండీ!" అంటూనే ప్రయాణీకుల దగ్గర్నుంచి డబ్బులుతీసుకుని చకచకా టిక్కెట్లు కొట్టిస్తున్నాడు కండక్టర్.

"ఎక్కడికెళ్లాలి అవ్వా?" వృద్ధురాలి దగ్గరకొచ్చి అడిగాడు కండక్టర్.

"సికిందరాబాదు స్టేషన్‌కి బాబూ!" అంటూ ఒక చేతిని కిందికి దించి బొడ్లో దోపుకుని వున్న చిన్న గుడ్డ సంచీని. అతి బలవంతం మీద పైకి లాగి అందులోంచి రూపాయి బిళ్ల తీసి కండక్టర్‌కి ఇచ్చింది.

"టిక్కెట్టుకొట్టి లవ్వా! ఆడవాళ్లు ముందు నుంచి ఎక్కాలి. వెనక నుంచి కాదు!" అని చెప్పి టిక్కెట్టు ఆమె చేతిలో పెట్టి ముందుకు కదిలాడు కండక్టర్.

అలా బస్సు ఆగినచోటల్లా కొంతమందిని దించి కొంతమందిని ఎక్కించుకొని బ్రతుకుభారాన్ని మోయలేక డీలాపడిపోతున్న మధ్యతరగతి మానవుడిలా నెమ్మదిగా వెళుతున్నది.

'సికింద్రాబాద్' స్టేషన్‌ని సమీపిస్తుండగా సడన్‌గా ఆగింది బస్సు.

"మళ్ళీ ఇక్కడెందుకు ఆపినట్టో?" ఉక్కపోతకు తాళలేక ప్రయాణీకులు గొణుగుతూ అనుకున్నారు.

బస్ రెండు డోర్ల దగ్గరకు ఇద్దరు "చెకింగ్. అధికారులు వచ్చి ప్రయాణీకులను క్రిందకు దిగనీయ కుండా అడ్డంగా నుంచున్నారు.

బస్ "చెక్" అవుతుందన్న సంగతి తెలుసుకున్న ప్రయాణీకులు తమ టిక్కెట్లను చూసుకున్నారు ఉన్నాయో? లేవో? అని.

కండక్టర్ దగ్గర ఎస్.ఆర్. తీసుకుని ప్రయాణీకుల టిక్కెట్ల నెంబర్లకీ ఎస్.ఆర్.లో నోట్ చేసున్న నెంబర్లకీ "టాలీ" చేసి ఒక్కొక్కరినీ కిందికి పంపిస్తున్నాడో అధికారి.

"అవ్వా! నువ్వెక్కడికి వెళుతున్నావు?" వృద్ధురాలిని ప్రశ్నించాడో పాతికేళ్ల యువకుడు. నలుపురంగు ఫాంటు ఆకుపచ్చరంగు షర్టుతో 'టక్' చేసుకుని క్రాపు వెనక్కి దువ్వి స్టయిల్‌గా, చలాకీగా వున్నాడా యువకుడు.

"స్టేషన్‌కి బాబూ!" ఆత్మీయతను గోచరింప చేస్తూ చిన్నగా నవ్వుతూ చెప్పింది.

• "స్టేషన్‌కి టిక్కెట్టు ఎంతకొట్టాడు?" మళ్లీ ప్రశ్నించాడు యువకుడు వృద్ధురాలికి మరింత దగ్గరికి జరిగి.

"రూపాయి తీసుకున్నాడు బాబూ!"

"తార్‌నాక" నుంచి 'స్టేషన్'కి ముప్పావలానే గదా? రూపాయెందుకు తీసుకుందు? ఏది నీ టిక్కెట్టు ఇద్దే చూద్దాం?" ఆశ్చర్యాన్ని ప్రదర్శిస్తూ అడిగాడు. వృద్ధురాలు ఆత్రుతగా తన సంచిలో వున్న టిక్కెట్టు తీసిచ్చింది.

"టిక్కెట్టును ముందుకి, వెనక్కి తిప్పుతూ" ఈ కండక్టర్లకు బుద్ధిలేకుండా పోతుంది. ఆఖరికి ముసలాళ్ల దగ్గరకూడా చిల్లర లేదంటూ పావలాలూ, అర్థలూ తీసుకుంటున్నారు" గొణుగుతూ మరల టిక్కెట్టు ఇచ్చేశాడు.

బస్సులో నుంచొని ప్రయాణిస్తున్న ప్రయాణీకు లందరూ క్రిందికి దిగటంతో చెకింగ్‌వాలా బస్ లోపలికొచ్చి కూర్చున్న వారి టిక్కెట్లు చెకింగ్ చేస్తున్నాడు.

"ఏదమ్మా! నీ టిక్కెట్టు?", వృద్ధురాలినడిగాడు చెకింగ్‌వాలా.

"వెంటనే చేతిలో వున్న టిక్కెట్టుని అందించింది."

"ఇది పాత టిక్కెట్టు, ఇదిగాదు, ఇప్పుడు, ఈ బస్సెక్కినపుడు తీసుకున్న టిక్కెట్టు ఇవ్వాళి" అన్నాడు.

"ఇదేనయ్యా ఇప్పుడు కొన్నాది! ఆ బాబెవరో ఇప్పుడు సూపిచ్చాడు గూడాను" అమాయకంగా చెప్పింది.

"ఎవరా బాబూ! చూపించు! చుట్టూ చూస్తూ సీరియస్‌గా అడిగాడు.

వృద్ధురాలు బస్సులోని ప్రయాణీకులందర్నీ ఒకసారి కలయచూసింది. ఆ యువకుడక్కడ కనబడక పోవటంతో క్రిందకు తిగి, ఏవో మాట్లాడుకుంటున్న ప్రయాణీకులను కూడా ఒకసారి కలయచూసింది. కానీ తన టిక్కెట్టును తీసుకొని ఇచ్చిన యువకుడు కనబడక పోవడంతో చిన్నబోయిన మొఖంతో, విచారాన్ని కూడగట్టుకున్న మనస్సుతో మళ్ళీ నెమ్మదిగా బస్సెక్కి "అయ్యా! ఆ బాబెక్కడా కనబడలేదయ్యా!" ఆవేదనగా భయంగా చెప్పింది.

"అయితే టిక్కెట్టు లేకుండా ప్రయాణం చేస్తున్నందుకు ఫైన్ కట్టు" అన్నాడు చెకింగ్ వాలా.

"మీరేమిటన్నారో నాకు తెలియరాలేదయ్య గారూ!" జంకుతూ ఎత్తుకున్న పిల్లాడిని భుజం మార్చుకుంటూ చెప్పింది.

ఈ తతంగాన్నంతా బస్సులోని ప్రయాణీకులంతా సరదాగా, ఆసక్తిగా చూస్తున్నారు.

"నువ్వు టిక్కెట్టు లేకుండా బస్సులో వస్తున్నందుకు పెనాల్టీగా ఆరడిగినంత డబ్బు చెల్లించుకోవాలంట! ప్రక్కసీట్లో కూర్చొనివున్న ఓ ఆసామి గట్టిగా చెప్పాడు వృద్ధురాలికి.

"అదేంటండీ! నేను రూపాయిచ్చి టిక్కెట్టు కొన్నాగా?" అయోమయంగా ప్రశ్నించింది వృద్ధురాలు.

"అబ్బ నీతో భలే చిక్కొచ్చిపడిందే!" అని సన్నగా నసుగుతూ "సర్లేగానీ పాతిక రూపాయివివ్వు "ఫైన్" గా! విసుగ్గా అన్నాడు ఏదో "బిల్" రాస్తూ!

ఆ మాటలకి వృద్ధురాలి ప్రాణాలు పైనేపోయినంత పనయింది. హృదయం నుంచి ఉబికివస్తున్న రోదనను పెదాలమీదికి తెచ్చుకుని భుజానున్న పిల్లాడిని క్రింద పండుకోబెట్టి చెకింగ్‌వాలా కాళ్లమీద పడి భోరున విలపించసాగింది.

"అయ్యో! నాకాడ ఒక్క పాతిక రూపాయలే వుండాయి. ఆటితో నా మనవణ్ణి డాక్టరికి సూపించాల. మందులు గొనాల. అందుకని ఈ ఒక్కసారికి నన్ను మన్నించి ఒదిలేయండయ్యా!" తన కన్నీటితో పాదాభిషేకం చేస్తూ చెప్పింది వృద్ధురాలు.

"పాతిక రూపాయలే వున్నాయా? చూపించు?" కటువుగా ప్రశ్నించాడు.

వృద్ధురాలు బొడ్లో దోపుకుని వున్న గుడ్డ సంచిని లాగి అందించింది అతనికి.

చెకింగ్‌వాలా సంచిని బోర్లించి చూశాడు. ఒక ఇరవై రూపాయలనోటు, ఒక ఐదు రూపాయాల నోటు మాత్రం వున్నాయి. ఆ రెండు నోట్లను కలిపి మడతపెట్టి పట్టుకుని "ఈ సారెప్పుడూ బస్సులో ప్రయాణంచేసేప్పుడు టిక్కెట్టు ఎవ్వరికీ ఇవ్వకు?" అన్నాడు.

"అట్టాగేనయ్యా!" తల వూపుతూ అన్నది.

కానీ వృద్ధురాలు అనుకున్నట్టు జరగలేదు. చెకింగ్ వాలా డబ్బు జేబులో పెట్టుకుని "మా డ్యూటీలు మేం చెయ్యక పోతే మా ఉద్యోగాలు పోతాయ్!" అంటూ ఏదో రాసిన రసీదుని వృద్ధురాలి చేతిలో పెట్టి బస్సు దిగివెళ్లాడు.

వృద్ధురాలు పిచ్చెక్కిన మూగదానిలాగా చేతిలో మున్న రసీదును వింతగా చూస్తుంది. వృద్ధురాలన్న కనికరంతో కాబోలు 'ఏడ్పు'' కూడా ఆవిడ్ని సమీపించటం లేదు.

• అప్పటివరకూ ఏదో విచిత్రం చూసినట్లు చూసిన ప్రయాణీకులు ఎవరి ధ్యాసల్లోకి వాళ్లు వెళ్లిపోయారు. కండక్టర్ "రైట్! రైట్!" అనటంతో బస్సు బయలుదేరింది. ●





## డిస్కో సూత్రం

డబ్బు సంపాయించడమేనా లక్ష్యం. అటు వంటప్పుడు సెక్సీగా నటించనంటే ఎలా? అందుకే వచ్చిన ప్రతి అవకాశాన్నీ వాడుకోవా అన్న పెద్దల సూక్తికి అనుగుణంగానే నేను నటిస్తున్నాను— అంటోంది ప్రముఖ సెక్సీ డాన్సర్ డిస్కోశాంతి.



## ప్రియ కార్యక్రమాలు

ప్రముఖ టివి నటి ప్రియా టెండూల్కర్ ప్రస్తుతం మరాఠీలో 'ఇమారత్' అనే టివి సీరియల్‌కు దర్శకత్వం వహిస్తోంది. ఇంతకు 'ఖేల్ ఘర్' అనే పిల్లల సీరియల్ తీసిన ప్రియ— కేవలం మిత్రుల మాటకాదన లేకనే నటించ డానికి అంగీకరిస్తున్నాను. దానికితోడు రచనా వ్యాసాంగం, గార్మెంట్ బిజినెస్ ఉండనే ఉన్నాయికదా! అంటోంది.